వక్ఫ్ చట్టాన్ని నిలిపివేయలేం

- సుప్రీంకోర్టుకు కేంద్రం నివేదన
- పిటిషన్లపై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ చట్టం, 2025ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు గురువారం మూడు అంశాలపై తన మధ్యంతర ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్ కింద ప్రకటించిన ఆస్తులను గుర్తించే అధికారం కూడా ఈ మూడు అంశాలలో ఉంది. మధ్యంతర ఉత్తర్వులను రిజర్వ్ చేయడానికి ముందు ఈ వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న పిటిషనర్ల వాదనలతోపాటు కేంద్రం వాదనలను వరుసగా మూడురోజులు ఆలకించింది. వక్ఫ్(సవరణ) చట్టాన్ని గట్టిగా సమర్థించిన కేంద్రం వక్ఫ్ స్వరూపంలోనే లౌకిక భావన ఉందని, రాజ్యాంగబద్ధంగా చట్టం ఆమోదం పొందిందన్న భావన కూడా దానికి అనుకూలంగా ఉందని తెలిపింది. కాగా, పిటిషనర్ల తరపున కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ చారిత్రకంగా, చట్టపరంగా, రాజ్యాంగ సూత్రాల పరంగా ఈ చట్టానికి అర్హత లేదని వాదించారు. చట్టరహిత ప్రక్రియ ద్వారా వక్ఫ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఈ చట్టం ఓ మార్గమని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులను ఓ పద్ధతి ప్రకారం స్వాధీనం చేసుకోవడానికి చేసిన చట్టంగా ఆయన దీన్ని అభివర్ణించారు. ఏ అంశాలను లేవనెత్తాలో ప్రభుత్వం నిర్దేశించలేదని ఆయన వాదించారు. ఈ దశలో వక్ఫ్ ఆస్తులు, రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌కి చెందిన కూర్పు, కలెక్టర్ విచారణ జరుపుతున్న కాలంలో సంబంధిత ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించకూడదన్న నిబంధన అనే మూడు అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

5 నెలల్లో 61 వేల టెకీలపై వేటు

టెక్ ఇండస్ట్రీలో ఆగని ఉద్యోగ కోతలు

న్యూఢిల్లీ: ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ(ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు తాజాగా మరోసారి వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130 కంపెనీలు కలిసి 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. ఈ నెల 13న మైక్రోసాఫ్ట్ 6 వేల మంది ఉద్యోగులను తొలగించింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. మరోవైపు, యూఎస్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ సుమారు 1500 మంది ఉద్యోగులను ఇంటికి పంపేందుకు సిద్ధమైంది. ఖర్చులు తగ్గించుకునే పనిలో భాగంగా ఉద్యోగాల కోతకు దిగింది. ఇక ఈ నెలలో గూగుల్ ప్రపంచవ్యాప్తంగా 200 మంది ఉద్యోగులను ఇంటికి పంపింది. కస్టమర్ సర్వీస్ మెరుగు పరచడానికి, కంపెనీ పునర్ నిర్మాణానికి ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్టు చెప్పింది. కంపెనీ ఆపరేషన్స్ క్రమబద్ధీకరించడానికి ఈ నెలలో వంద మందిని తొలగించినట్టు అమెజాన్ పేర్కొంది.

మైక్రోసాఫ్ట్‌లో ఏఐ సిస్టమ్ ఇంజినీర్లపై వేటు

ఏఐ-కోడింగ్ మాత్రమే కాదు దానిపై ఆధారపడి పని చేసినా ఉద్యోగాలు పోయేటట్టు ఉన్నాయి. మైక్రోసాఫ్ట్ కంపెనీలో జరిగిన తాజా ఉదంతమే అందుకు ఉదాహరణ. బ్లూంబర్గ్ విశ్లేషణ ప్రకారం అమెరికాలోని వాషింగ్టన్ స్టేట్‌లో ఇటీవల తొలగించిన ఉద్యోగుల్లో 40 శాతం మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. వీరిలో కొందరిని కొన్ని నెలల ముందు ఏఐ టూల్స్ మీద ఆధారపడి పనిచేయమని కంపెనీ సూచించింది. కానీ ఇటీవల వారి ఉద్యోగ విధులను ఏఐ భర్తీ చేయడంతో వారు కొలువులు కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఆ ఇంజినీర్లు తమకు తెలియకుండానే తమ ప్రత్యామ్నాయాలకు శిక్షణ ఇచ్చారా అన్న ప్రశ్న తలెత్తింది. ఇటీవల తమ కోడింగ్ వర్క్‌లో మూడో భాగం కృత్రిమ మేధనే చేస్తున్నదని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

బోర్డు తిప్పేసిన దుబాయ్ బ్రోకరేజి కంపెనీ

రూ. కోట్లలో నష్టపోయిన భారతీయ ఇన్వెస్టర్లు

దుబాయ్, మే 22: దుబాయ్‌కి చెందిన ఓ స్టాక్ బ్రోకరేజ్ కంపెనీ రాత్రికి రాత్రే బిచాణా ఎత్తేసింది. ప్రవాస భారతీయులతోసహా పెద్ద సంఖ్యలో ఇన్వెస్టర్లు కోట్లలో నష్టపోయారు. దుబాయ్‌లోని గోల్డెన్ టవర్‌లో కార్యకలాపాలు సాగించిన గల్ఫ్ ఫస్ట్ కమర్షియల్ బ్రోకర్స్ కార్యాలయాలను రాత్రికి రాత్రే ఖాళీ చేసి నిర్వాహకులు పరారయ్యారు. ఫోరెక్స్ పెట్టుబడులను ప్రోత్సహించి ఇన్వెస్టర్లను నిలువునా ముంచి పరారైన నిర్వాహకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. గోల్డెన్ టవర్‌లోని 302, 305 సూట్స్‌లో గత నెల వరకు దాదాపు 40 మంది సిబ్బందితో జోరుగా కార్యకలాపాలు సాగాయి. ఆఫీసులను పూర్తిగా ఖాళీ చేసిన నిర్వాహకులు హడావుడిగా తాళాలు ఇచ్చి వెళ్లిపోయారని సెక్యూరిటీ గార్డు ఖలీజ్ టైమ్స్ దినపత్రికకు తెలియచేశాడు. ఇప్పుడు రోజూ బాధితులు వచ్చి పారిపోయిన వ్యక్తుల గురించి వాకబు చేస్తున్నారని అతను చెప్పాడు. పెట్టుబడి పెట్టి నష్టపోయిన బాధితుల్లో కేరళ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన మొహమ్మద్, ఫయాజ్ పొయిల్ ఉన్నారు. వీరిద్దరూ గల్ఫ్ ఫస్ట్‌లో 75,000 డాలర్లు(దాదాపు రూ. 65 లక్షలు) పెట్టుబడి పెట్టి మోసపోయారు. తాను సమాధానాల కోసం ఇక్కడకు వచ్చానని, కానీ ఇక్కడ ఖాళీ ఆఫీసులు తప్ప ఏమీ లేదని ఫయాజ్ చెప్పారు. అన్ని ఫోన్ నంబర్లకు కాల్ చేశానని, కానీ ఎవరూ స్పందించడం లేదని ఆయన తెలిపారు. తన మాతృభాష కన్నడంలో మాట్లాడిన రిలేషన్ షిప్ మేనేజర్ మాయమాటలు నమ్మి 2.30 లక్షల డాలర్లు(రూ. 1.98 కోట్లు) పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయానని మరో భారతీయ బాధితుడు వాపోయారు.

ప్రీ కౌన్సెలింగ్ ఫీజు బహిర్గతం తప్పనిసరి

నీట్ పీజీపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ అడ్మిషన్లలో చాలా కాలేజీలు సీట్లను విస్తృతంగా బ్లాక్ చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ నీట్-పీజీ కోసం అన్ని ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలు ప్రీ కౌన్సెలింగ్ ఫీజును తప్పనిసరిగా బహిర్గతం చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. సీట్లను బ్లాక్ చేయడం వల్ల వాస్తవ సీట్లు ఎన్ని ఉన్నాయో చెప్పకుండా వక్రీకరణ జరుగుతున్నదని, ఆశావహుల్లో అసమానతను పెంచుతున్నదని, మెరిట్ ప్రాతిపదికన పొందగలిగే అవకాశాలను తగ్గిస్తున్నదని ధర్మాసనం పేర్కొంది. ఇక నుంచి అన్ని ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలు ప్రీ కౌన్సెలింగ్ ఫీజ్ గురించి వెల్లడించాలని ఆదేశించింది. అన్ని రకాల చార్జీలు స్పష్టంగా వివరించాలని పేర్కొంది. అలాగే జాతీయ వైద్య కమిషన్ కింద కేంద్రీకృత ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

నిలబడకుండా.. కూర్చోకుండా విమాన ప్రయాణం

తక్కువ ఖర్చుతో విమాన ప్రయాణాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. బైక్ మాదిరిగా ప్యాడెడ్ సీట్లను విమానాల్లో ఏర్పాటు చేయబోతున్నారు. ప్రయాణికులు పూర్తిగా కూర్చోవడం కానీ, నిల్చోవడం కానీ చేయడానికి అవకాశం ఉండదు. కేవలం ఓ వైపు ఆనుకుని ప్రయాణం చేయాలి. ఈ ప్రత్యేక సీట్లను స్కైరైడర్ 2.0 అని పిలుస్తున్నారు. ఈ కొత్త విధానం 2026లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఈడీ చార్జిషీట్‌లో రేవంత్!

మొదటిపేజీ తరువాయి...

ఏ రేవంత్ రెడ్డి, దివంగత నేత అహ్మద్ పటేల్, పవన్ బన్సల్ పేర్లు ఉన్నాయి. 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాల్లో యంగ్ ఇండియన్ సంస్థకు వరుసగా రూ.6.90 కోట్లు, రూ.5.05 కోట్ల మేర విరాళాలు వచ్చినట్టు ఈడీ గుర్తించింది. ఈ డబ్బును ఆ సంస్థ 2011-12 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఆదాయ పన్ను పెండింగ్ బిల్లును చెల్లించేందుకు వినియోగించినట్టు ఈడీ పేర్కొన్నది. అయితే దర్యాప్తు సంస్థ.. చార్జిషీట్లో వీరెవరినీ నిందితులుగా పేర్కొనలేదు. మరోవైపు.. చార్జిషీటులో పేరు రావడంపై రేవంత్ రెడ్డి నుంచి కాని బన్సల్ నుంచి కాని ఇప్పటి వరకు ఎటువంటి స్పందన రాలేదని డెక్కన్ హెరాల్డ్ పేర్కొన్నది.

ఒత్తిడి చేసి వసూళ్లు..

యంగ్ ఇండియన్ సంస్థకు విరాళాలు ఇచ్చేలా కాంగ్రెస్ నేతలపై సీనియర్లు ఒత్తిడి తెచ్చినట్టు తమ దర్యాప్తులో తేలిందని ఈడీ పేర్కొన్నది. అహ్మద్ పటేల్ అభ్యర్థనను కాదనలేక యంగ్ ఇండియన్‌కి రూ.30 లక్షల విరాళాన్ని తన బ్యాంకు ఖాతా నుంచి ఇచ్చానని, మరో రూ. 20 లక్షలు నగదుగా ఇచ్చానని అరవింద్ విశ్వనాథ్ సింగ్ చౌహాన్ అనే కాంగ్రెస్ నాయకుడు చెప్పినట్టు తెలిపింది. అహ్మద్ పటేల్ తనకు ఏఐసీసీ కార్యాలయంలో పోస్టింగ్ ఇప్పిస్తానని, 2019 లోక్

సభ ఎన్నికల్లో తన అల్లుడికి హిమాచల్ ప్రదేశ్‌లోని మండి టికెట్ ఇప్పిస్తానని హామీ ఇచ్చి యంగ్ ఇండియన్‌కు విరాళాలు తీసుకున్నారని రాజీవ్ గంభీర్ అనే నాయకుడు వాంగ్మూలం ఇచ్చినట్టు ఈడీ తెలిపింది. అయితే తనకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తన డబ్బులు వెనక్కి ఇవ్వాలంటూ గంభీర్ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి లేఖ రాసినట్టు ఈడీ వెల్లడించింది.

ఏ1గా సోనియా, ఏ2గా రాహుల్

ఈ కేసులో భాగంగా 2023 నవంబర్‌లో ఢిల్లీ, ముంబై, లక్నోలోని ఏజేఎల్‌కు చెందిన రూ. 751.9 కోట్ల మేర విలువైన ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకొంది. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్‌ను దాఖలు చేసిన ఈడీ.. అందులో ఏ1గా సోనియాను, ఏ2గా రాహుల్‌ను పేర్కొన్నది. పీఎంఎల్‌ఏలోని సెక్షన్లు 3, 4, 44, 45 కింద నిందితులను శిక్షించాలని ఈడీ కోరుతున్నది. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే పదేండ్ల వరకూ జైలు శిక్ష పడుతుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు.

అసలేమిటీ కేసు?

నేషనల్ హెరాల్డ్ పత్రికను 1938లో జవహర్ లాల్ నెహ్రూ, పలువురు స్వాతంత్ర్య సమరయోధులు కలిసి ప్రారంభించారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ప్రచురణ సంస్థ నేషనల్ హెరాల్డ్‌ను ప్రచురించేది. నేషనల్ హెరాల్డ్ సంస్థ బకాయిలు పేరుకుపోవడంతో 2008లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. కాగా, 2010లో కాంగ్రెస్ పార్టీ ఏజేఎల్ సంస్థకు రూ.90 కోట్ల మేర రుణాలు ఇచ్చింది. 2010 నవంబర్‌లో ఆ రుణాలను వసూలు చేసుకొనే హక్కును రూ. 50 లక్షలకే యంగ్ ఇండియనన్ అనే కంపెనీకి కట్టబెట్టింది. అలా ఏజేఎల్‌కు చెందిన 99 శాతం షేర్లు యంగ్ ఇండియాకు బదిలీ అయ్యాయి. ఈ యంగ్ ఇండియన్ కంపెనీలో సోనియా, రాహుల్‌కు 76 శాతం షేర్లు ఉన్నాయి. కాగా, సోనియా, రాహుల్ ప్రధాన భాగస్వాములైన యంగ్ ఇండియన్ కంపెనీ కేవలం రూ. 50 లక్షలు చెల్లించి, రూ. 90.25 కోట్ల విలువైన ఏజేఎల్ సంస్థ ఆస్తులపై హక్కు సాధించిందని, ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 2,000 కోట్ల వరకు ఉంటుందని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి 2012లో కోర్టును ఆశ్రయించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల కొనుగోలుకు కాంగ్రెస్ పార్టీ నిధులను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఈ కేసులో 2021లో ఈడీ దర్యాప్తు మొదలైంది. సీబీఐ విచారణ మొదలై.. మధ్యలోనే నిలిచినప్పటికీ, ఈడీ దర్యాప్తు కొనసాగుతున్నది.

సెంట్రల్ హౌసింగ్ స్కీమ్‌లో దివ్యాంగులకు 4% కోటా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్‌లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం ప్రకటించింది. ఈ చర్య సమానత్వాన్ని ప్రోత్సహించడమే కాకుండా దివ్యాంగుల సాధికారతకు కీలక ముందడుగని ఈ సందర్భంగా కేంద్రం పేర్కొన్నది. నివాసాల కేటాయింపులో ఈ రిజర్వేషన్ దివ్యాంగులకు గౌరవం, సమానత్వం, సౌలభ్యతను అందించడంలో సహాయపడుతుందని, అలాగే వారికి ప్రభుత్వ పథకాల అందుబాటును పెంచుతుందని కేంద్రం పేర్కొన్నది.

ఆరుగురికి కీర్తి చక్ర

33 మందికి శౌర్యచక్ర

న్యూఢిల్లీ, మే 22: విధి నిర్వహణలో అసాధారణ పరాక్రమం ప్రదర్శించిన ఆర్మీ, జమ్ముకశ్మీర్ పోలీసులకు చెందిన ఆరుగురికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం కీర్తి చక్ర పురస్కారాలను ప్రదానం చేశారు. కీర్తిచక్ర భారత దేశంలో రెండో అత్యున్నత స్థాయి శౌర్య పురస్కారం. గురువారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 33 మందికి శౌర్య చక్ర పురస్కారాలను కూడా రాష్ట్రపతి అందజేశారు.

సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ చార్జిషీట్

బెదిరింపులకు తలొగ్గనన్న మాజీ గవర్నర్

న్యూఢిల్లీ, మే 22: జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకుడు సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. కిష్ట్వార్‌లోని కిరు జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్టు ఐదుగురిపై అభియోగాలు మోపింది. ప్రాజెక్టు సివిల్ వర్క్స్ కోసం పటేల్ ఇంజినీరింగ్ సంస్థకు చెందిన ఫైల్‌ను ఆమోదించేందుకు రూ.300 కోట్లు లంచం తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఆధారాలతో అభియోగపత్రం దాఖలు చేసింది. మరోవైపు తాను అనారోగ్యంతో దవాఖానలో చేరానని, ఎవరితోనూ మాట్లాడే పరిస్థితిలో లేనని సత్యపాల్ వెల్లడించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని తనను బెదిరించేందుకు ప్రయత్నిస్తున్న నియంతకు తలొగ్గే ప్రసక్తే లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

అన్ని హద్దులూ దాటుతున్న ఈడీ

దర్యాప్తు సంస్థపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 22: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అన్ని హద్దులను దాటుతున్నదని, రాజ్యాంగంలోని సమాఖ్య పాలన భావనను అతిక్రమిస్తున్నదని సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమిళనాడు రాష్ట్ర మద్యం లైసెన్సుల నిర్వహణ సంస్థ తస్మాక్{తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్)పై ఈడీ దాడులు, దర్యాప్తును సుప్రీంకోర్టు నిలిపివేసింది. తస్మాక్‌పై ఈడీ దర్యాప్తునకు అనుమతినిస్తూ ఏప్రిల్ 23న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును మద్రాసు హైకోర్టు మంగళవారం కొట్టివేసిన దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం ఈడీపై సంచలన వ్యాఖ్యలు చేసింది.

మోదీ మా ప్రశ్నలకు జవాబివ్వు

- సినిమా డైలాగులు మాకొద్దు
- ట్రంప్ చెప్తున్నది నిజమా కాదా?
- ప్రధాని స్పష్టం చేయాలి: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే కారణమంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం పలు దేశాలకు దౌత్య బృందాలను పంపడం ప్రజల దృష్టిని మరల్చే విన్యాసాల్లో భాగమని విమర్శించింది. ప్రధాని మోదీ బహిరంగ సభల్లో భారీ డొల్ల సినిమా డైలాగులు చెప్పడం కాదని.. ఓ తీవ్రమైన అంశానికి సంబంధించి తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'పహల్గాంలో కిరాతక హత్యలకు పాల్పడిన హంతకులు ఇంకా స్వేచ్ఛగా ఎందుకు తిరుగుతున్నారు? గత ఏడాదిన్నర కాలంలో పూంచ్, గగన్‌గిర్, గుల్మార్గ్‌లో జరిగిన ఉగ్ర దాడులకు కూడా వారే కారణమని కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ అంశంపై మీరు (ప్రధాని) అఖిలపక్ష సమావేశం ఎందుకు ఏర్పాటు చేయలేదు, ప్రతిపక్ష పార్టీలను విశ్వాసంలోకి ఎందుకు తీసుకోవడం లేదు?' అని నిలదీశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పాకిస్థాన్ వెంటనే ఖాళీ చేయాలని కోరుతూ 1994 ఫిబ్రవరి 22న పార్లమెంట్ ఉభయసభలు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించాయని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా, పాకిస్థాన్ మధ్య అనుబంధం స్పష్టంగా వెల్లడైన నేపథ్యంలో ఆ తీర్మానాన్ని పునరుద్ఘాటించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని ఆపింది తామేనంటూ రెండు వారాలుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆ దేశ విదేశాంగ మంత్రి రూబియో పదేపదే ప్రకటనలు చేస్తున్నా మోదీ మొండిగా మౌనం వహించడానికి కారణమేమిటని నిలదీశారు. వాణిజ్య ఒప్పందంపై వాగ్దానం ద్వారా తానే భారత్, పాక్ మధ్య సైనిక ఘర్షణను నివారించానని ట్రంప్ అనేకమార్లు చెప్పుకున్నారని, కానీ ఇంతవరకు ప్రధాని మోదీ ఆ ప్రకటనలను తిరస్కరించలేదని అన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఒక అడుగు ముందుకేసి, భారత్-పాక్ మధ్య చర్చలు తటస్థ వేదికపై జరుగుతాయని చెప్పారని, దీనిపై మన విదేశాంగ మంత్రి కూడా స్పందించడం లేదని విమర్శించారు. 'ఈ భీకరమైన నిశ్శబ్దం ఎందుకు?' అని ఆయన వాపోయారు. ఆపరేషన్ సిందూర్‌ను అనూహ్యంగా, ఆకస్మికంగా నిలిపివేయడంపైనే కాకుండా దాని ప్రభావంపై తీవ్రమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని జైరాం రమేశ్ చెప్పారు. దీనికి కార్గిల్ తరహా కమిటీ వేయడమే పరిష్కారమని సూచించారు. కార్గిల్ యుద్ధం ముగిసిన మూడు రోజుల అనంతరం నాటి వాజపేయి ప్రభుత్వం 1999, జూలై 29న ఓ రివ్యూ కమిటీ వేసిందని తెలిపారు. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను 2000, ఫిబ్రవరి 23న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు.

సంక్షిప్త వార్తలు

భారత్ బయోటెక్ కలరా టీకా హిల్‌కాల్

హైదరాబాద్: ఓరల్ కలరా టీకా (ఓసీవీ) హిల్‌కాల్ మూడో దశ క్లినికల్ పరీక్షలు విజయవంతంగా పూర్తయినట్లు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ బుధవారం ప్రకటించింది. దేశంలోని 10 క్లినికల్ ప్రదేశాల్లో ఒక ఏడాది వయసుగల చిన్నారుల నుంచి వయోవృద్ధుల వరకు 1,800 మంది ఈ పరీక్షల్లో పాల్గొన్నట్లు తెలిపింది. ఓసీవీలకు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 కోట్ల డోసుల డిమాండ్ ఉన్నట్లు పేర్కొంది. హైదరాబాద్, భువనేశ్వర్‌లలోని తమ యూనిట్లలో ఏటా 20 కోట్ల మోతాదుల హిల్‌కాల్‌ను ఉత్పత్తి చేసేందుకు భారత్ బయోటెక్ సన్నాహాలు చేస్తున్నది.

జమ్ము కశ్మీర్‌లో జవాన్ వీర మరణం

జమ్ము, మే 22: జమ్ముకశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాలు ఇద్దరు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టాయి. గురువారం ఉదయం ఇక్కడ జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జవాన్ వీర మరణం పొందారు. 'ఛాత్రూలోని షింగ్‌పోరా ప్రాంతంలో నలుగురు ఉగ్రవాదులు దాక్కున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. రెండు వర్గాల మధ్య పెద్ద ఎత్తున కాల్పులు చోటుచేసుకోగా, ఓ జవాన్ అత్యంత ధైర్యసాహసాలు చూపుతూ గాయపడ్డారు. దవాఖానకు తరలించేలోగా ప్రాణాలు కోల్పోయారు' అని వైట్‌నైట్ కార్ప్స్ 'ఎక్స్'లో పేర్కొన్నది.

పాక్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం: మోదీ

బికనీర్: ఈ యుద్ధం ద్వారా పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టామని, సిందూరం గన్‌పౌడర్‌గా మారినప్పుడు ఏం జరుగుతుందో దేశ శత్రువులు తెలుసుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం వ్యాఖ్యానించారు. పహల్గాం దాడి క్రమంలో భారత్ ప్రతిస్పందనను ప్రపంచం మొత్తం చూసిందని, శత్రువులు స్వయాన దానిని అనుభవించారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన అనంతరం రాజస్థాన్‌లోని బికనీర్‌లో గురువారం తొలిసారిగా బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 22న తొమ్మిది అతిపెద్ద ఉగ్రవాద స్థావరాలను 22 నిమిషాల్లోనే ధ్వంసం చేసినట్టు చెప్పారు.

అమెరికాలో ఇద్దరు ఇజ్రాయెలీ దౌత్య సిబ్బంది కాల్చివేత

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని ఇజ్రాయెలీ ఎంబసీకి చెందిన ఇద్దరు సిబ్బందిని జ్యూయిష్ మ్యూజియం వద్ద షికాగోకు చెందిన ఎలియాస్ రోడ్రిగ్స్ అనే వ్యక్తి కాల్చి చంపాడు. వెంటనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా పాలస్తీనాకు విముక్తి కల్పించాలి అంటూ ఆ వ్యక్తి నినాదాలు చేశాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. మృతులను రిసెర్చ్ సహాయకుడు యరోన్ లిషిన్‌స్కీ, విదేశీ పర్యటనలను నిర్వహించే సరాహ్ మిల్గ్రిమ్‌గా గుర్తించినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడాన్ సార్ తెలిపారు.

ఉగ్రవాదంపై పోరు.. భారత్‌కు జపాన్, యూఏఈ సంఘీభావం

అబుదాబి/టోక్యో : ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ సాగిస్తున్న యుద్ధానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జపాన్ సంఘీభావం ప్రకటించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు పార్లమెంట్ సభ్యులతో కూడిన భారత ప్రతినిధి బృందం రెండు దేశాల రాజధానులను గురువారం సందర్శించింది. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే సారథ్యంలోని ప్రతినిధి బృందం యూఏఈ నేతలతో చర్చలు జరిపింది. జేడీయూ ఎంపీ సంజయ్ షా నేతృత్వంలోని మరో ప్రతినిధి బృందం జపాన్ నాయకులతో సంప్రదింపులు జరిపింది.

బ్రిటన్‌ను వీడుతున్న వారిలో అత్యధికులు భారతీయులే

లండన్ : బ్రిటన్ వీసా, ఇమిగ్రేషన్ విధానాలను కఠినతరం చేయడంతో ఆ దేశం నుంచి వెళ్లిపోతున్న విదేశీయుల్లో భారతీయులే ఎక్కువగా ఉన్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన 2024 సంవత్సరానికి సంబంధించిన నివేదిక ప్రకారం, బ్రిటన్‌కు ఉన్నత చదువుల కోసం వెళ్లిన 37,000 మంది; ఉద్యోగాల కోసం వెళ్లిన 18,000 మంది; ఇతర కారణాలతో వెళ్లిన 3,000 మంది భారతీయులు ఆ దేశం నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాతి స్థానంలో చైనా ఉంది. 45,000 మంది చైనా విద్యార్థులు, వర్కర్లు బ్రిటన్ నుంచి వెళ్లిపోయారు.

మైసూరు శాండల్ అంబాసిడర్‌గా తమన్నా.. నెటిజన్ల విమర్శలు

బెంగళూరు: మైసూరు శాండల్ సబ్బు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి తమన్నా భాటియాను కర్ణాటక ప్రభుత్వం ఎంపిక చేసింది. రెండేళ్లపాటు ఆమె ఈ సబ్బును ప్రమోట్ చేస్తారు. అయితే, ఆమెను ఎంపిక చేయడంపై కన్నడిగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కన్నడ సినీ రంగంలో నటీమణుల కొరత ఉందా?